సాక్షి
కర్నూలు
శుక్రవారం 8 నవంబర్ 2024



## అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన నాట్యతరంగిణి, నంది కొట్కూర్‌కు చెందిన సాయి నృత్యకళాశాల వారి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి.



## అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు గురువారం శ్రీశైలానికి చెందిన పి.ప్రభావతి రూ.లక్ష విరాళాన్ని అందించారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | : 1,633 |
| ప్రస్తుతం | : 1,632 |
| సామర్థ్యం (టీఎంసీలు) | : 105.788 |
| ప్రస్తుతం | : 101.773 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 10,601 |
| అవుట్ ఫ్లో | : 10,241 |

## న్యూస్‌రీల్

### అర్జీలకు స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.వెంకట సత్యనారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చే అర్జీలకు స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వడంపై అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు జిల్లా అధికారులు మాత్రమే జాగ్రత్తగా చూసి సరైన ఎండార్స్‌మెంట్‌ను తెలుగులో మాత్రమే ఇవ్వాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లా అధికారులందరికీ లాగిన్ ఇస్తామన్నారు. సీఎంఓ గ్రీవెన్స్‌కు సంబంధించి 30 రోజుల సమయం ఉండడంతో 10 రోజులకు ముందే సరైన విచారణ చేయిస్తే పరిష్కారాలు లభిస్తాయన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి శిక్షణ ఇచ్చారు.

### నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాల విద్యార్థులు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు https://navodaya.gov.in వెబ్ సైట్‌లో, 11వ తరగతి విద్యార్థులు https://cbseitms.nic.in/2023 సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

### కొత్త విద్యుత్ సర్కిళ్లకు ఏఈ, ఏఈఈలు కేటాయింపు

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పడిన విద్యుత్ సర్కిళ్లకు ఏఈ, ఏఈఈలను కేటాయించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి కర్నూలు నుంచి ఏర్పడిన నంద్యాల జిల్లా నూతన విద్యుత్ సర్కిల్‌కు ఏడుగురు ఏఈలు, 10 మంది ఏఈఈలను కేటాయించారు. అందులో కర్నూలు సర్కిల్ నుంచి ఆరుగురు ఏఈలను, 9 మంది ఏఈఈలను, నెల్లూరు జిల్లా నుంచి ఏఈ, ఏఈఈను కేటాయించారు.

### గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు ఉంటే అర్హులే

కర్నూలు(సెంట్రల్): గ్యాస్ కనెక్షన్ ఉండి రేషన్ కార్డు, ఆధార్ ఉంటే ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందనేది కేవలం అపోహ మాత్రమేనని, దానిని ఎవరూ నమ్మవద్దని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్యాస్ కనెక్షన్‌కు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో అనుసంధానం కోసం ఈకేవైసీ కచ్చితంగా చేయించుకుంటే అర్హుల జాబితాలోకి పేర్లు వస్తాయని వివరించారు. కాగా, జిల్లాలో గ్యాస్ కనెక్షన్ ఉన్న 4,72,581 మంది ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులుగా తేలారన్నారు. మరో 80 వేల మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. జిల్లాలో నవంబర్ 1 నుంచి ఇప్పటి వరకు 77 వేల మంది సిలిండర్ బుకింగ్ చేసుకోగా..ఇప్పటి వరకు 32 వేల మందికి మాత్రమే సిలిండర్లను డెలివరీ ఇచ్చినట్లు చెప్పారు. ఇందులో 27,065 మందికి మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్ కింద చెల్లించే రుసుం 19,86,927 చెల్లించినట్లు చెప్పారు. సమావేశంలో డీఎస్ఓ రాజారఘువీర్ పాల్గొన్నారు.

### 10న డీఎస్సీ ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

కర్నూలు (అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మూడు నెలల ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం స్క్రీనింగ్ టెస్టును ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మి దేవి తెలిపారు. జిల్లాలోని ఏడు కళాశాలల్లో ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఈ పరీక్షకు మొత్తం 797 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆమె గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ ఎస్సీ/ఎస్టీ కోచింగ్ స్క్రీనింగ్ టెస్టుకు హాజరయ్యే అభ్యర్థులు http://jnanabhumi. ap.gov.in పోర్టల్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. గూగుల్ క్రోమ్ ఆన్‌లైన్ బ్రౌజర్‌లో పరీక్ష రాయవలసి ఉంటుందన్నారు. అభ్యర్థి కేవలం డీఎస్సీ పరీక్ష ట్యాబ్ మాత్రమే తెరవాలన్నారు. మరో బ్రౌజర్ తెరిస్తే ఆటోమేటిక్‌గా పరీక్ష ముగించబడుతుందని, పరీక్షను కొనసాగించేందుకు మరో అవకాశం ఉండదని జేడీ స్పష్టం చేశారు.

# యురేనియం.. వీడని భయం!

- యురేనియం తవ్వకాలపై తొలగని సందిగ్ధత
- ప్రజలకు అవగాహన కల్పించకుండా తవ్వకాలు వద్దని ఏఎండీకి కలెక్టర్ ఆదేశాలు
- కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉందంటున్న అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్
- 68 బోర్ల అనుమతులు రద్దు చేయాలని ప్రజల డిమాండ్
- పరిశోధన మాత్రమే ఏఎండీది... తవ్వకాల బాధ్యత యూసీఐఎల్‌ది
- నాణ్యత, లభ్యత ఆధారంగా యూసీఐఎల్‌కు కేంద్రం అప్పగించే అవకాశం



యురేనియం తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన రిజర్వు ఫారెస్ట్

దశాబ్దాలుగా ఫ్యాక్షన్ రాజకీయాలతో అభివృద్ధికి దూరమైన ఆ పల్లెసీమలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. అంతలోనే ఆ ఊళ్లపై కుంపటిలా యురేనియం తవ్వకాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ యురేనియం మాట వినగానే పల్లెలు హడలిపోతున్నాయి. ఎన్నో అనుమానాలు అక్కడి జనాన్ని వెంటాడుతున్నాయి. ఓ వైపు బోర్లకు అనుమతులు, వెలుగు చూస్తున్న జీవోలు.. మరో వైపు అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి తవ్వకాలను అడ్డుకుంటామని పోరుబాట పట్టారు. కొన్ని రోజులుగా కప్పట్రాళ్ల కొండల్లో మండుతున్న యురేనియం ఆందోళన ఉప్పెనలా మారుతుందా? లేదా ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది. – సాక్షిప్రతినిధి కర్నూలు

కప్పట్రాళ్ల రిజర్వ్‌ఫారెస్టు పరిధిలోని 15 గ్రామాల ప్రజల గుండెల నిండా యురేనియం భయమే. యురేనియం తవ్వకాలపై సందిగ్ధత వీడలేదు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాలేదు. ఇప్పుడు తవ్వకాలు జరగడం లేదు అని కలెక్టర్ చెబుతున్నారు. కానీ తవ్వకాలు జరపం, ఏఎండీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తామని ప్రకటించ లేదు. దీంతో తవ్వకాలపై భయమో? లేదా ప్రభుత్వ అధికారులు చెబుతున్న అపోహలో ఏవైనా ప్రజల్లో ఆందోళన ఉంది. దీంతోనే ప్రత్యక్ష ఆందోళనలకు దిగారు. వీరికి ప్రతిపక్షపార్టీలు మద్దతు ప్రకటించాయి. 68 బోర్లు తవ్విన తర్వాత ఆపై మైనింగ్‌ను అడ్డుకోలేమని, ఇప్పుడే బోర్ల అనుమతి రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అక్కడి గ్రామస్తులతో పాటు ప్రతిపక్షపార్టీలు గట్టిగా ఉన్నాయి. కప్పట్రాళ్ల పరిధిలోని 1,170.65 ఎకరాల్లో యురేనియం నిక్షేపాల పరిశోధన కోసం అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ (ఏఎండీ)కి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గతంలో 2017లో మొదట 20 బోర్లు తవ్వారు. ఇప్పుడు 50 మీటర్ల లోతులో 68 బోర్లు తవ్వేందుకు అనుమతులు పొందారు. దీంతో కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని 15 గ్రామాల ప్రజలు ప్రత్యక్ష ఆందోళనలకు దిగారు. దేవనకొండ, కర్నూలు కలెక్టరేట్, రహదారులపై రాస్తారోకోతో పాటు పలు రకాల ఆందోళనకు దిగారు. వీటికి స్థానిక ఎమ్మెల్యే విరూపాక్షితో పాటు వామపక్షపార్టీలు, పలు ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. గురువారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బృందం కూడా ఆ గ్రామాలను సందర్శించాలని మొదట నిర్ణయించింది. అయితే కలెక్టర్ రంజిత్‌బాషా 'యురేనియం లభ్యత, పరిశోధన కోసం ఎలాంటి బోర్ల తవ్వకాలు జరగడం లేదు. వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని, విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని' బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ తర్వాత ఎస్పీ బిందుమాధవ్ కూడా పార్టీ నేతలతో మాట్లాడారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ తమ పర్యటన తాత్కాలికంగా వాయిదా వేసుకుంది.

### తవ్వకాలపై వాస్తవాలు ఇవి!

అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ అనేది కేవలం యురేనియం పరిశోధన, అన్వేషణ చేసే భారత ప్రభుత్వ రంగ సంస్థ. దేశంలోని 29 రాష్ట్రాలలో ఎక్కడ రేడియా ధార్మిక మూలకాలు ఉంటాయో అన్వేషించి వాటిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం వరకే దీని బాధ్యత. ఈ క్రమంలోనే 2017లో అప్పటి టీడీపీ, బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కప్పట్రాళ్ల అడవిలో 20 బోర్లు తవ్వేందుకు అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత 2023లో ఎన్డీయే ప్రభుత్వమే మరో 68 బోర్లు తవ్వేందుకు అనుమతి ఇచ్చింది. అప్పుడు, ఇప్పుడూ రెండు అనుమతులు ఇచ్చింది ఎన్డీయే ప్రభుత్వమే. తవ్వకాల్లో యురేనియం నాణ్యత, లభ్యతపై నివేదిక కేంద్ర ప్రభుత్వానికి ఏఎండీ ఇస్తుంది. దీన్ని బట్టి యురేనియం మైనింగ్ చేయాలా? వద్దా? అనేది కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. తవ్వకాలు చేపట్టి ఖనిజాన్ని వెలికితీయాలని కేంద్రం భావిస్తే అప్పుడు కప్పట్రాళ్ల రిజర్వ్‌ఫారెస్టులో మైనింగ్‌ను యూసీఐఎల్ (యూరేనియం కార్పొరేషన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్)కు అప్పటిస్తుంది. యూసీఐఎల్ తవ్వకాలు చేపడుతుంది.



గతంలో అటవీ ప్రాంతంలో వేసిన బోరు

- దేశంలో ప్రస్తుతం 7 యురేనియం మైనింగ్‌లు ఉన్నాయి. వీటన్నిటినీ యూసీఐఎల్ చేపడుతోంది. దేశంలో తొలి యురేనియం మైనింగ్ జార్ఖండ్‌లోని జాదుగూడలో 1967లో ప్రారంభించారు. దీంతో పాటు అదే రాష్ట్రంలోని బాటిన్, మొహుల్దీ, జగ్గాట, బాటిన్, నార్వఫహార్‌తో పాటు టాటానగర్‌లోని తౌరం. దీలో మైనింగ్ జరిపారు. ఆపై మన రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లాలోని తుమ్మలపల్లిలో యురేనియం మైనింగ్ ప్రారంభించారు.
- రేడియో ధార్మిక మూలకమైన దీన్ని అణుబాంబులు, న్యూక్లియర్ రియాక్టర్లు, అణు విద్యుత్‌తో పాటు పలు రకాలుగా వినియోగిస్తారు.



ప్రజల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి (ఫైల్)

### తవ్వకాలపై స్పష్టత ఏదీ?

కలెక్టర్ ప్రకటించినట్లు ప్రస్తుతం 68 బోర్ల తవ్వకాలు జరగడం లేదు. అయితే తవ్వకాలకు అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్‌కు అనుమతులు వచ్చింది మాత్రం వాస్తవం. ప్రజల ఆందోళనల నేపథ్యంలో అక్టోబర్ 28న ఏఎండీ రీజినల్ డైరెక్టర్ ఎఆర్ ముకుందన్, జిల్లా అటవీశాఖ అధికారి శ్యామల కలెక్టర్ రంజిత్‌బాషాను కలిశారు. ప్రాజెక్టు వివరాలు, తవ్వకాలపై కలెక్టర్‌కు వివరించారు. తవ్వకాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించిన తర్వాతే పనులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంటే ప్రజల ఆమోదంతో తవ్వకాలు జరపొచ్చనేది స్పష్టమవుతోంది. బుధవారం చేసిన ప్రకటనలో 'తవ్వకాలు జరగడం లేదు!' అని చెప్పారు. 'తవ్వకాలు జరపం.. బోర్ల తవ్వకాలు అనుమతులు ఇవ్వం' అని చెప్పలేదు. దీంతో ప్రజల్లో వీటిపై స్పష్టత లేదు. పైగా మీడియా, సోషియల్ మీడియా 'దేశ భద్రతకు వ్యతిరేకంగా పని చేసే శక్తులు ప్రజలు అపోహపడేలా రెచ్చగొడుతున్నారు' అని పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య చెప్పారు. కానీ ప్రభుత్వం నుంచి అపోహలను పక్కనపెట్టి వాస్తవాలను ప్రజల ముందు ఉంచి, వారికి అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. దీంతోనే ప్రజలు యురేనియం తవ్వకాలపై ఆందోళన చెందుతున్నారు.

### యురేనియం తవ్వకాలు ఆపాల్సిందే



యురేనియం తవ్వకాలు పశువులు, పంటలు, ప్రజలకు హానికరం. పులివెందుల నియోజకవర్గంలోని యురేనియం మైనింగ్‌తో అక్కడ ప్రజల ఆరోగ్యాలు, పంటలు, పశువులు ఎలా దెబ్బతిన్నాయో మనకు అనుభవం ఉంది. ఈ క్రమంలో ఏ ప్రభుత్వమైనా తవ్వకాలపై ముందుకెళ్లడం ప్రజలకు హానికరం. అనుమతుల అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేసుకుంటున్నాయి. అనుమతులు ఎవరు ఇచ్చినా రద్దు చేయాలి. ప్రజలపై ప్రేమ ఉన్న ఏ ప్రభుత్వమైనా యురేనియం తవ్వకాల అమనుమతులను రద్దు చేయాల్సిందే. ఈ అంశంలో ఇదే మా ఏకైక డిమాండ్.

– ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

# పనులు కల్పించలేకపోతే మీరెందుకు?

- ఉపాధి హామీ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): 'జిల్లాలో ప్రజలు ఒకవైపు పనుల కోసం వలసలు వెళ్తుంటే ఏమి చేస్తున్నారు.. కూలీలకు పనులు కల్పించకపోతే మీరెందుకు' అంటూ కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఉపాధి హామీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా వెనుకబడి ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్, రీసర్వేపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలసలను సాకుగా చూపి పనిచేయడం లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈరోజు కూడా వలసలపై వార్తలు వచ్చాయని, ఇతర ప్రాంతాల్లో ఎక్కువ కూలీ వస్తుందని వారు వలస వెళ్లారా లేదంటే.. పనులు చూపట్ట లేకపోవడంతో వెళ్లారా అనే దానిపై నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓలను ఆదేశించారు. వెల్దుర్తి, కృష్ణగిరి, పెద్దకడబూరు, ఆదోని, తుగ్గలి, కర్నూలు, కోసిగి, ఎమ్మిగనూరు, కౌతాళం, సీబెళగల్ మండలాల్లో జిల్లా సరాసరి కంటే తక్కువగా ఉపాధి పనులు జరిగాయన్నారు. ఆదోని, పెద్దకడబూరుల్లో కనీసం రోజుకు 100 మందికి కూడా పనులు కల్పించలేకపోవడం శోచనీయమన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ఇసుక సమస్య ఉంటే జాయింట్ కలెక్టర్‌తో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత వారంలో కేవలం 90 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు అర్బన్‌లలో ఎక్కువ ఇళ్లు నిర్మించాల్సి ఉందని, ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులు 100 శాతం ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 52.88 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన శాతాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి డీఈఓ శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

# ఇంటి వద్దే క్యాన్సర్ పరీక్షలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని 18 సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తికి వారి ఇంటి వద్దే రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలను శిక్షణ పొందిన వైద్యనిపుణులు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, పట్టణ ప్రాంతాల్లో యుపీహెచ్‌సీ స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు ఈ స్క్రీనింగ్‌లను పర్యవేక్షిస్తారని చెప్పారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్న కేసులను పీహెచ్‌సీకి రెఫర్ చేసి మరింత క్షుణ్ణంగా పరీక్షిస్తారన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ జయలక్ష్మి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి హేమలత, డీపీఎంవో డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు, డెమో శ్రీనివాసులు, ఎపడమాలజిస్టు వేణుగోపాల్, డీసీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థాన ప్రత్యేక అధికారిగా చంద్రశేఖర ఆజాద్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి ప్రత్యేక అధికారిగా దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్‌ను నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు బదిలీ కావడంతో దేవస్థాన సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డికి ప్రభుత్వం ఇన్‌చార్జ్ ఈఓ బాధ్యతలు అప్పగించింది. కాగా కార్తీక మాసోత్సవాలు వైభవంగా జరుగుతుండటంతో వాటిని పర్యవేక్షించేందుకు, ఈనెల 9న ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీశైలం పర్యటన నేపథ్యంలో దేవదాయశాఖ ప్రత్యేక అధికారిని నియమించింది.

## కొత్త విద్యుత్ సర్కిళ్లకు ఏఈ, ఏఈఈలు కేటాయింపు

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పడిన విద్యుత్ సర్కిళ్లకు ఏఈ, ఏఈఈలను కేటాయించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి కర్నూలు నుంచి ఏర్పడిన నంద్యాల జిల్లా నూతన విద్యుత్ సర్కిల్‌కు ఏడుగురు ఏఈలు, 10 మంది ఏఈఈలను కేటాయించారు. అందులో కర్నూలు సర్కిల్ నుంచి ఆరుగురు ఏఈలను, 9 మంది ఏఈఈలను, నెల్లూరు జిల్లా నుంచి ఏఈ, ఏఈఈను కేటాయించారు.

## శ్రీశైలంలో 182 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో 182.6050 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బుధవారం నుంచి గురువారం వరకు జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి 30,839 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు అంతే పరిమాణం(30,839 క్యూసెక్కులు)లో నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 878.90 అడుగులకు చేరుకుంది.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

కర్నూలు (లీగల్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబర్ 14వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ న్యాయ శాఖ, పోలీసు శాఖల సమన్వయంతోనే విజయవంతం చేద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి.కబర్ధి అన్నారు. గురువారం స్థానిక న్యాయ సేవాసదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అధ్యక్షతన పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్రంలో కర్నూలు జిల్లా మూడవ స్థానంలో నిలిచిందని, ఈ సారి అత్యధిక కేసులు పరిష్కరించి మొదటి స్థానంలో నిలిచి కర్నూలు జిల్లాకు మరింత పేరు తెద్దామన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, డీఎస్పీలు బి.వెంకట్రామయ్య, శేషాద్రి, బాబుప్రసాద్‌లతో పాటు సీఐలు, ఎస్ఐలు, న్యాయవాదులు, ఇన్సురెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# ఇంకా ఎదురుచూపులే!

- డీఎస్సీ నోటిఫికేషన్ తాత్కాలిక వాయిదాతో ఆందోళనలో అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,645 పోస్టులు
- ఎస్‌జీటీ 1,731, స్కూల్ అసిస్టెంట్లు 816
- మున్సిపల్ స్కూళ్లలో 98 పోస్టుల భర్తీకి నోటిఫై
- స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు డీఎస్సీలో పోస్టులు చూపించని ప్రభుత్వం

కర్నూలు సిటీ: డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు నిరీక్షణ తప్పడం లేదు. అదిగో ఇదిగో నోటిఫికేషన్ అంటూ కూటమి సర్కారు తీవ్ర జాప్యం చేస్తోంది. వివిధ కారణాలు చూపి వాయిదాలా మీద వాయిదాలు వేస్తోంది. టెట్ ఫలితాలు వెలువడిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తామని గతంలో విద్యాశాఖ ప్రకటించింది. ఈనెల 4వ తేది ఫలితాలు రావడంతో నోటిఫికేషన్ ప్రకటన ఎప్పుడు వస్తుందా అని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఏడాదికిపైగా వారు అన్ని పనులు మానుకొని పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొందరు అప్పులు చేసి కోచింగ్ తీసుకున్నారు. మరో వైపు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉమ్మడి జిల్లాలో ఎన్ని పోస్టులు భర్తీ చేస్తున్నారు, ఏఏ కేటగిరిలో భర్తీ చేస్తున్నారో తెలియజేసేందుకు వెబ్ సైట్‌ను సైతం సిద్ధం చేశారు. అయితే, ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ జారీకి ఎలాంటి ఆదేశాలు రాకపోవడం.. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్ల అమలు అంశం కొలిక్కి రాకపోవడం, స్పోర్ట్స్ కోటా పెంపు తదితర కారణాలతో ఇప్పట్లో డీఎస్సీ నిర్వహణపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

### స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు అన్యాయం

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన చేసేందుకు స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేయాలి. ఈ కోర్సు చేసిన అభ్యర్థులకు గత నెలలో టెట్ నిర్వహించారు. అయితే, మెగా డీఎస్సీలో ఈ కోర్సుకు సంబంధించి ఒక్క పోస్టు కూడా భర్తీ చేయడం లేదు. విద్యాశాఖ నోటిఫై చేసిన పోస్టులను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. పోస్టులే లేనప్పుడు తమకు ఎందుకు టెట్ నిర్వహించారని ఆ కోర్సు చేసిన అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.



### సబ్జెక్టుల వారీగా పోస్టుల వివరాలు

నూతన డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ 1731 (తెలుగు మీడియం 1611,కన్నడ 28, ఉర్దూ 92), స్కూల్ అసిస్టెంట్లు తెలుగు ఉర్దూ 06, కన్నడ 03, తెలుగు 70, హిందీ 113, ఇంగ్లిషు 78, గణితం ఉర్దూ 08, కన్నడ మీడియం 16, తెలుగు 66, ఫిజికల్ సైన్స్ కన్నడ 12, తెలుగు 54, బయోలాజికల్ సైన్స్ తెలుగు 56, ఉర్దూ 03, కన్నడ 13, సోషల్ స్టడీస్ తెలుగు మీడియం 99, ఉర్దూ 11, కన్నడ 02, ఫిజికల్ ఎడ్యుకేషన్ 206, మున్సిపల్ స్కూళ్ల యాజమాన్యంలో ఎస్‌జీటీ 38, స్కూల్ అసిస్టెంట్లు తెలుగు 11, హిందీ 2, ఇంగ్లిషు 4, గణితం 3, ఫిజికల్ సైన్స్ 4, బయోలాజికల్ సైన్స్ 4, సోషల్ స్టడీస్ 4, ఫిజికల్ ఎడ్యుకేషన్ 6 పోస్టుల భర్తీ చేయనున్నారు.

### ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,645 పోస్టులు

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 2,329, ప్రాథమికోన్నత పాఠశాలలు 860, ఉన్నత పాఠశాలలు 1,010 ఉన్నాయి. ఈ స్కూళ్లలో సుమారు 7,96,195 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి బోధన చేస్తున్న ఉపాధ్యాయులు సుమారు 26,164 మంది ఉన్నారు. గత ప్రభుత్వం డీఎస్సీ ద్వారా జిల్లాలో 1,693 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఎన్నికల కోడ్ తదితర కారణాలతో పరీక్షలను వాయిదా వేశారు. ఐదునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది డిసెంబరు వరకు పదవీ విరణ చేసే టీచర్ల ఖాళీలను కలిపి 2,645 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో ఎస్‌జీటీ 1,731, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 816, మున్సిపల్ స్కూళ్లలో వివిధ కేటగిరిలకు సంబంధించిన పోస్టులు 98 ఉన్నాయి.

## క్లుప్తంగా

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


బాషాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంజామల: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు బాషా ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఆయన ఈ నెల 6న గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి డిస్కస్ త్రోలో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంతో సత్తా చాటారు. ఈ ప్రదర్శనతో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు బాషాను గురువారం తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

### వీధికుక్క దాడిలో 18 మందికి గాయాలు


కుక్కకాటుకు గురైన సలామియ్య

నందికొట్కూరు: పట్టణంలో గురువారం వీధికుక్క స్వైరవిహారం చేస్తూ కనిపించిన వారిపై దాడి చేయడంతో 18 మంది గాయపడ్డారు. బాధితులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో, మరికొందరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందారు. పట్టణంలోని రాజావీధి, సంగయ్యపేట, పాతబస్టాండ్, కోటావీధి, కురువపేట, బొంగుల వీధి తదితర ప్రాంతాల్లో గురువారం వీధుల్లో వెళుతున్న వారిపై కుక్క దాడి చేసి కరిచింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఫిర్యాదు అందుకున్న మున్సిపల్ సిబ్బంది వెంటాడినా కుక్క పట్టుబడలేదు. బాధితులను మున్సిపల్ కమిషనర్ బేబి పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆమె మాట్లాడుతూ.. వీధికుక్కల బెడద నియంత్రణకు ఉన్నతాధికారుల అనుమతుల కోసం నివేదిక పంపినట్లు చెప్పారు.

### రేషన్ బియ్యం పట్టివేత

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడులో గురువారం 210 బస్తాల్లోని 95 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గోస్పాడులోని అన్వర్ గోడౌన్‌లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ రేషన్ బియ్యాన్ని స్థానిక వీఆర్‌ఓ రవీందర్, ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

# నవనందుల దర్శనం.. సర్వపాపహరణం

- కాశీ క్షేత్రాన్ని దర్శించుకున్నంత పుణ్యఫలం
- కార్తీక పౌర్ణమి రోజున పాదయాత్ర చేస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం
- మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి రాక


సాక్షి మల్లికార్జునస్వామి

నంద్యాల(వ్యవసాయం): దేవతల ద్వారా సృష్టించబడిన ఈ నవనందులు.. నందవంశ చక్రవర్తుల ద్వారా అభివృద్ధి చెందాయని పురాణాలు చెబుతున్నాయి. ఏటా కార్తీక మాసం పౌర్ణమి గడియల్లో అధిక సంఖ్యలో భక్తులు నవనందులను దర్శించుకుంటారు. ఉదయమే కార్తీక స్నానం ఆచరించి ఈ పవిత్ర నందులను దర్శిస్తే కాశీ విశ్వేశ్వరుడిని దర్శించినంత పుణ్యం లభిస్తుందని, భూమండలాన్ని తిరిగివచ్చిన ఫలితం ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. దీనివల్ల సర్వపాపాలు తొలగిపోతాయని భక్తులకు ప్రగాఢ విశ్వాసం. అందుకే భక్తులు కార్తీక మాసం పౌర్ణమి నాడు పాదయాత్ర ద్వారా నవనందులను దర్శించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇందుకు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు. కార్తీక పౌర్ణమి రోజున పాదయాత్ర చేసి నవనందులను దర్శించుకుంటే తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. నవనందుల యాత్ర చేపట్టేవారు తెల్లవారుజామునే కార్తీక స్నానాలు ఆచరించి ఉపవాస దీక్షతో మొదట పట్టణంలోని గుడిపాటిగడ్డలోని మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించి నవనందులను దర్శించుకొని సాయంత్రం మళ్లీ మల్లికార్జునస్వామిని దర్శించుకొని నీవే సాక్షి అంటూ శరణు వేడుకుంటారు. అందుకే ఇక్కడి స్వామి వారు సాక్షి మల్లికార్జునుడిగా కీర్తింపబడ్డారు. ఇక్కడి సాక్షి మల్లికార్జున స్వామిని దర్శించుకొని నవనందుల ప్రదక్షిణ చేస్తే వారికి కాశీ క్షేత్ర దర్శన ఫలితం కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. దీనివల్ల భక్తులకు అష్టైశ్వర్యాలు, సిరిసంపదలు, సౌభాగ్యం, సంతాన ప్రాప్తి కలుగుతాయని వారి నమ్మకం. ఈ మొత్తం పాదయాత్ర 50 కి.మీ లోపే ఉంటుంది. పాదయాత్రగా వెళ్లలేని వారు కార్లు, ఆటోలు, బైక్‌లపై వెళ్లి నవనందులను దర్శనం చేసుకుంటారు.


నవనందుల రూట్ మ్యాప్

### నవనందుల ప్రదక్షిణను విజయవంతం చేయండి

మన ఊరు, మనగుడి–మన బాధ్యత నంద్యాల జిల్లా ఇన్‌ట్యాచ్ ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహించే నవనందుల ప్రదక్షిణను విజయవంతం చేయాలని కన్వీనర్ శివకుమార్‌రెడ్డి గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని వేలాది మందితో నవనంది ప్రదక్షిణ కార్యక్రమాన్ని నంద్యాల ప్రథమనంది దేవస్థానం నుంచి ప్రారంభమై రాత్రి మహానంది క్షేత్రంలో జరిగే జ్వాలా తోరణం, కోటి దీపోత్సవంతో పూర్తవుతుందన్నారు. నవనంది ప్రదక్షిణం కైలాసగిరి ప్రదక్షిణతో సమానమని, ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు. భక్తులు అందరూ ఈ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


**ప్రథమ నంది:** ప్రథమ నందీశ్వర స్వామి ఆలయం నంద్యాల పట్టణానికి నైరుతి వైపున చామకాల్వ ఒడ్డున ఉంది. లక్ష్మి, సరస్వతి దేవి ప్రతిష్టించిన లింగం ఇక్కడ ఉంది. ఇక్కడ ఉత్తరాయణ కాలంలో సూర్యకిరణాలు స్వామివారిని స్పర్శిస్తాయని వేదపండితులు చెబుతున్నారు. అలాగే గాయత్రి దేవి కొలువై పూజలందుకుంటున్నారు. ఈ దర్శనం వల్ల భక్తులకు అష్టైశ్వర్యాలు, విద్య, శుభాలు కలుగుతాయి.


**నాగనంది:** నంద్యాల పట్టణంలోని బైటిపేట ఆంజనేయస్వామి దేవాలయంలో ఉమాసమేత నాగనందిగా స్వామివారు కొలువుదీరారు. పూర్వం గరుత్మంతుడి దాడికి తట్టుకోలేక నాగేంద్రుడు నాగజాతి మనుగడ కోసం పరమేశ్వరుడి అనుగ్రహం కోసం తపస్సు చేయడం నాగనందీశ్వర స్వామిని ప్రతిష్ఠించారు. ఈ నందిని నాగదోషాలు, సంతానం లేనివారు పూజలు చేస్తే దోషాలు తొలగిపోయి సంతానప్రాప్తి కలుగుతుంది.

**సోమనంది:** పట్టణానికి తూర్పు భాగాన ఆత్మకూరు బస్టాండ్ వద్ద సోమనంది ఆలయం ఉంది. చంద్రుడికి మరోపేరు సోముడు. చంద్రుడు ప్రతిష్ఠించిన ఈ ఆలయాన్ని సోమనందీశ్వర స్వామి ఆలయంగా పిలుస్తారు. ఇక్కడ చంద్రుడు తప్పు చేసిన ప్రాంతంగా వ్యవహరిస్తుంటారు. శివుడిని ఎంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారో ఇక్కడ నందిని కూడా అంతే భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.




**శివనంది:** బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో శివుడే స్వయంభుగా ఏర్పడి శివనందిగా పేరొందింది. ఈ నందిని మరో పేరుతో రుద్రనందిగా పిలుస్తుంటారు. ఇక్కడ తంజావూరు శిల్పకళచే ఐదు దేవాలయాలు నిర్మించబడ్డాయి. శివనంది త్రేతా యుగం కాలంలో ప్రతిష్ఠింపబడిందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు ఈ దేవాలయాన్ని దర్శించుకున్నట్లు శాసనాలు ఉన్నాయి. ఐదవ శతాబ్దంలో రెండవ పులకేశికి శివుడే స్వప్న దర్శనంలో శివనంది ఆలయాన్ని ప్రతిష్ఠించాలని సూచించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయంలో శ్వేతనాగులు ఉండటంతో రాహుకాలదోష నివారణ పూజలు నిర్వహిస్తుంటారు.


**విష్ణునంది:** బండి ఆత్మకూరు మండలం నల్లమల అటవీ ప్రాంతంలో స్వయాన మహావిష్ణువు శివుడి కోసం తపస్సు చేసి ప్రసన్నం చేసుకొని విష్ణునందిని ప్రతిష్ఠించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. శివకేశవుల కలయికనే ఈ విష్ణునంది. అన్ని దేవస్థానాల్లో నవగ్రహాలను ఈశాన్యం వైపు ప్రతిష్టిస్తారు. కానీ ఇక్కడ రుగ్వేదానుసారం నవగ్రహాలను ఆగ్నేయం దిశలో ప్రతిష్ఠించారు. ఈ నవగ్రహాలకు వాహనాలు ఉండటం ప్రత్యేకత. గురువుకు ఐరావతం వాహనం, శనికి దున్నపోతు వాహనంగా ఉండటం ఓ ప్రత్యేక చాటుకుంది.


**మహానంది:** రాష్ట్రంలో శ్రీశైలం పుణ్యక్షేత్రం తర్వాత మహానందీశ్వరస్వామిని భక్తులు నిత్యం దర్శించుకోవడం విశేషం. ఇక్కడ గోమాత పాదగుర్తులతో శివలింగం భక్తులకు దర్శనమిస్తుంది. ఈ శివలింగం అడుగు భాగం నుంచి నీరు నంది నోటి నుంచి రుద్రగుండంలోకి అంతరవాహినిగా ప్రవహిస్తూ నేటికి రహస్యంగా నెలకొల్పబడింది.


**వినాయక నంది:** మహానంది దేవస్థానానికి దక్షిణ భాగాన వినాయకనంది వెలసింది. స్వయాన వినాయకుడే శివుడి కోసం తపస్సు చేసి వినాయక నందిని ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. స్వామివారిని దర్శించుకోవడం వల్ల సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.


**గరుడ నంది:** మహానందికి పడమటి వైపు గరుడ నంది గరుత్మంతుడే స్వయంగా ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. భక్తులు సర్పదోష నివారణ కోసం అభిషేకాలు, పూజలు నిర్వహిస్తుంటారు. ఇక్కడ పూజలు చేస్తే దోషాలు తొలుగిపోతాయని నమ్మకం ఉంది.


**సూర్యనంది:** మహానంది మండలంలోని సూర్యనందిని సూర్యుడు శాపవిమోచన కోసం ఇక్కడ తపస్సు చేసి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. ఉత్తరాయణ కాలంలో ఉదయం వేళ సూర్యకిరణాలు స్వామివారిని స్పర్శిస్తాయి. ఆ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ఇక్కడి స్వామి వారిని అభిషేకించడం వల్ల ఆయురారోగ్యాలు, ఉద్యోగ ప్రాప్తి, భోగభాగ్యాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఈ పాదయాత్ర వల్ల భక్తులకు కాశీయాత్ర చేసి విశ్వేశ్వరుడిని దర్శించుకున్నంత పుణ్యఫలం లభిస్తుందని వేద పండితులు చెబుతున్నారు.

## భార్య హత్యకేసులో భర్తకు జీవిత ఖైదు


నిందితుడితో దొర్నిపాడు పోలీసులు

ఆళ్లగడ్డ: అనుమానం పెనుభూతంగా మారి కట్టుకున్న భర్తే అతి కిరాతకంగా భార్యను హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఐదవ అదనపు జిల్లా కోర్టు గురువారం తీర్పునిచ్చింది. కేసు పూర్వపరాలు ఇలా.. నంద్యాల జిల్లా గోస్పాడుకు చెందిన లక్ష్మీదేవిని 20 సంవత్సరాల క్రితం దొర్నిపాడు మండలం డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామానికి చెందిన పుల్లయ్యకు ఇచ్చి వివాహం చేశారు. కొన్నేళ్లు సంసారం సాఫీగా సాగింది. తర్వాత పుల్లయ్య భార్యపై అనుమానం పెంచుకుని తరుచూ గొడవపడేవారు. ఈ క్రమంలో 2022 ఏప్రిల్ 8న రాత్రి దంపతులు గొడవపడ్డారు. అనంతరం లక్ష్మీదేవి నిద్రించగా పుల్లయ్య గొడ్డలితో నరికి హత్యచేశాడు. ఈ ఘటనపై దొర్నిపాడు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు గురువారం ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా కోర్టులో తుది విచారణకు రాగా నేరం రుజువు కావడంతో నిందితుడు పుల్లయ్యకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ తీర్పు వెలువరించారు. నిందితుడు పుల్లయ్యను రూరల్ సీఐ కంబగిరిరాముడు, దొర్నిపాడు ఎస్‌ఐ వెంకటేష్ కారాగారానికి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం


మృతి చెందిన చాకలి చిరంజీవి

కృష్ణగిరి: కూలీలతో అతివేగంగా దూసుకొచ్చిన ఆటో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బైకిస్టు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఉదయం మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలంకొండ గ్రామానికి చెందిన చాకలి నాగేశ్వరరావు, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం ఉన్నారు. ఉదయం బొంది మడుగుల సమీపంలో నాగేశ్వరరావు బైక్ నిలిచిపోవడంతో కుమారుడు చిరంజీవి (15) పెట్రోల్ తీసుకుని హోండాషైన్ బైక్ (ఏపీ 39 జేయు 6973)పై తండ్రికి ఇచ్చేందుకు వెళుతున్నాడు. ఆ సమయంలో లక్కసాగరం వైపు నుంచి కూలీలతో బయలుదేరిన మద్దికెర మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఖలీల్‌బాషా అనే వ్యక్తి తన ఆటో (ఏపీ 21 టీడబ్ల్యు4770)ను అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కాగా వెంటనే డోన్‌కు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఉన్న ఒక్క కుమారుడు ఇలా అకాల మరణంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు గురువారం ఆటో డ్రైవర్ ఖలీల్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వాహనం ఢీకొని వ్యక్తి మృతి


సుందరరాజు (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామం సమీపంలోని పూలచింత క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని సుందరరాజు (42) అనే వ్యక్తి మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరు టౌన్‌కు చెందిన సుందర రాజు తెలంగాణ రాష్ట్రం, అయిజ పట్టణంలో గుజిరి షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి షాపు పనులు ముగించుకుని బైక్‌పై ఎమ్మిగనూరుకు తిరిగి వెళుతున్నాడు. నాగలదిన్నె గ్రామ సమీపంలోని పూలచింత క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సుందరరాజు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య మేరి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## శ్రీవారి మెట్లోత్సవంలో శ్రీమఠం పీఠాధిపతి


పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, టీటీడీ ఈఓ శ్యామలరావు

మంత్రాలయం: కార్తీక మాసంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే మెట్లోత్సవ కార్యక్రమంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పాల్గొన్నారు. గురువారం మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. మెట్ల మార్గంలో మంత్రాలయం దాససాహిత్య భజన మండలి సభ్యులు చేపట్టిన సంకీర్తనలు, భజన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీవారి పాదాల వద్ద మెట్లకు టీటీడీ ఈఓ శ్యామలరావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

## వర్చువల్ ల్యాబ్‌ను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సి.కళ్యాణి

కర్నూలు (సిటీ): జిల్లాలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధన చేసేందుకు ఏర్పాటు చేసిన వర్చువల్ ల్యాబ్‌ను గురువారం ట్రైనీ కలెక్టర్ సి.కళ్యాణి పరిశీలించారు. వచ్చే మార్చిలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు వర్చువల్‌గా బోధన చేసేందుకు డీఈఓ ఆఫీసులో ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ల్యాబ్ ద్వారా విద్యాశాఖ ఎంపిక చేసిన సబ్జెక్టు నిపుణుల చేత వర్చువల్ బోధన చేయించనున్నారు. వర్చువల్ లైవ్‌ను టెస్టు చేసి ఉపయోగాల గురించి ట్రైనీ కలెక్టర్‌కు డీఈఓ శామ్యూల్ పాల్ వివరించారు. త్వరలోనే వర్చువల్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు డీఈఓ తెలిపారు.

## స్విమ్మింగ్‌లో పతకాల పంట


రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా స్విమ్మర్లు రికార్డు స్థాయిలో పతకాలు సాధించారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల బాల బాలికల స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారులు మొత్తం 17 మెడల్స్ సాధించారు. అండర్–19 బాలుర విభాగంలో మనోజ్ 100 మీటర్ల బ్రెక్ స్ట్రోక్‌లో వెండి, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో కాంస్యం, మనీష్ 1500 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో 3 బంగారు పతకాలు, 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో వెండి, అండర్ –19 బాలికల విభాగంలో షేక్ సామియా తంజీమ్ 50 మీటర్లు, 100 మీటర్లు బట్టర్ ఫ్లై, 100 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో మూడు బంగారు పతకాలు, అండర్–17 బాలికల విభాగంలో పి.హేమలత 100 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్‌లో బంగారు, 100 మీటర్ల బట్టర్ ఫ్లై, 100 మీటర్ల బ్రెక్ స్ట్రోక్‌లో కాంస్యం, అండర్–17 బాలుర విభాగంలో షేక్ మహమ్మద్ షాకీబ్ 100 మీటర్ల ఫ్రీ స్టైల్ కాంస్యం, కె.వైశాలి 100మీటర్ల ఫ్రీ స్టైల్ 50మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో 2 బంగారు పతకాలు, అర్చన 100 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్యం, బి.సురేఖ 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో వెండి, 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్యం, అండర్–14 బాలికల విభాగంలో 200 మీటర్ల బట్టర్ ఫ్లైలో బి.సిరి చేతనరాజ్ వెండి, కె.శృతి 200 మీటర్ల బట్టర్ ఫ్లైలో వెండి పతకాలు సాధించారు. విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను పల్నాడు స్విమ్మింగ్ శిక్షకులు సురేష్‌కుమార్, కర్నూలు ఈత కొలను శిక్షకులు నటరాజరావు, తిరుపతి జిల్లా ఈత శిక్షకులు చక్రవర్తి అందజేసి అభినందించారు. పతకాలు సాధించిన స్విమ్మర్లను జిల్లా క్రీడల అభివృద్ధి అదికారి భూపతిరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణయాదవ్ అభినందనలు తెలియజేశారు.

## శుభకార్యానికి వచ్చి మృత్యువాత

- ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


మృతి చెందిన గురుప్రసాద్

కొలిమిగుండ్ల: స్నేహితుడి సోదరి పెళ్లి కోసం మిత్రులతో కలిసి వచ్చారు. పెళ్లి తంతు కంటే ముందే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా ద్వారకచెర్లకు చెందిన గురుప్రసాద్ (24), శ్రీకాళహస్తికి చెందిన అరవింద్, నంద్యాలకు చెందిన ప్రదీప్‌తో పాటు మొత్తం ఐదుగురు స్నేహితులు కారులో అవుకు మండలం రామాపురంలో స్నేహితుడి సోదరి వివాహ కార్యక్రమానికి వచ్చారు. ముహూర్తం కావడంతో సాయంత్రం సరదాగా బెలుం గుహలను చూసేందుకు వెళ్లారు. పెళ్లి సమయం అవుతుండడంతో రామాపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో అక్కదేవతల ఆలయం సమీపంలో బనగానపల్లె వైపు నుంచి వస్తున్న లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గురుప్రసాద్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. అరవింద్ అనే యువకుడికి తీవ్రగాయాలు కాగా మిగతా ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న కారును జేసీబీ సాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



## మెడికోకు రూ.50 వేలు ఆర్థిక సహకారం


చెక్కును అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(అర్బన్): గోనెగండ్ల మండలం ఆలువాల గ్రామానికి చెందిన పేద విద్యార్థి ఎం.అద్భుత్‌కుమార్‌ను దత్తత తీసుకున్న ఏపీ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సహకారాన్ని అందించింది. విద్యార్థి అద్భుత్ కుమార్ స్థానిక చిన్నటేకూరు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి నీట్‌లో సత్తా చాటడం ద్వారా అనంతపురం మెడికల్ కళాశాలలో సీటు సాధించి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి కళాశాల, హాస్టల్ ఫీజుకు అవసరమైన రూ. 50 వేల చెక్కును అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు అందించారు. గురువారం స్థానిక కార్యాలయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు హరిదాసు ఈరన్న, సభ్యులు పాల్గొన్నారు.



## టీడీపీ నేతల నుంచి ప్రాణహాని

- రక్షణ కల్పించాలని చిరు వ్యాపారుల వేడుకోలు


మాట్లాడుతున్న మహబూబ్‌బాషా

నంద్యాల: టీడీపీ నాయకుల నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆళ్లగడ్డకు చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకులు మహబూబ్‌బాషా, మాబుహుసేన్, రసూల్ తదితరులు వాపోయారు. గురువారం సాయంత్రం నంద్యాల ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేసేందుకు వచ్చిన వారు అనంతరం విలేకరులతో మాట్లాడారు. చికెన్ వ్యాపారి హుసేన్‌వలి మాట్లాడుతూ.. తాను ఆళ్లగడ్డలో 40 ఏళ్లుగా చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నానని చెప్పారు. ఇటీవల పెద్దచింతకుంటకు చెందిన కుందూరు హర్షవర్ధన్‌రెడ్డి తనకు ఫోన్ చేసి 'చికెన్ సెంటర్ నడుపుకోవాలంటే కోళ్లను తమ వద్దే కొనాలని, లేకపోతే తమ ప్రభుత్వం ఐదేళ్లు ఉంటుందని కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి టీడీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ తమ దుకాణాలను మూయించడమే గాక వెళ్లి వారితో రాజీ పడమని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. బీరువాల వ్యాపారి హుస్సేన్‌వలి మాట్లాడుతూ.. హర్షవర్ధన్ రెడ్డి అనే రౌడీషీటర్ ఎస్‌ఐ వెంకట్ రెడ్డి సహకారంతో తన ఇంట్లోకి దూరి విలువైన సామాన్లతో పాటు డబ్బు దోపిడీ చేశారని, ఇదేమిటని ప్రశ్నించిన తన తల్లిదండ్రులను అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టడమే గాక జీవనాధారంగా ఉన్న శిల్పాలు, తయారీ కోసం తెచ్చిన రాళ్లను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డలో పెట్రేగిపోతున్న రౌడీలు, గుండాల అరాచకాలను అరికట్టి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

## దిశ వన్‌స్టాప్ కేంద్రం పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని దిశ వన్‌స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం (శక్తి సదన్)ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, శక్తి సదన్ ఆవరణలో కాలువ నీటితో అపరిశుభ్రత నెలకొనడంతో వెంటనే శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అక్కడున్న వారికి లీగల్ సర్వీసెస్ యాక్ట్ - 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు. అధికారులు పాల్గొన్నారు.

### శిశు గృహం పరిశీలన

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ ఆధ్వర్యంలో గురువారం సి.క్యాంప్‌లోని శిశు గృహంలో శిశు రక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యాలయ రిజిస్టర్లను పరిశీలించి అక్కడి పిల్లలకు అవసరమైతే ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలియజేశారు. సదస్సులో మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి అనురాధ, డాక్టర్ శిరీష, డాక్టర్ నిస్సిగ్రేస్, డాక్టర్ జానకిరామ్ రెడ్డి, లీగల్ ఎయిడ్ అడ్వకేట్ సులోచన, నవయుత ఎన్‌జీవో డైరెక్టర్ లక్ష్మీనారాయణ, రిసోర్స్ పర్సన్లుగా నియమించారు. వీరు శిశువుల రక్షణ, నవజాత శిశువుల సంరక్షణ, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.